# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 14-01-2017**

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రగతి భవన్ లో శుక్రవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హోంమంత్రి నాయిని నర్సింహరెడ్డి, డిజిపి అనురాగ్ శర్మ, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ మహేందర్ రెడ్డి, హోంశాఖ కార్యదర్శి రాజీవ్ త్రివేది, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, సిఎంఒ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పోలీస్ శాఖ, పరిశ్రమల శాఖ చాలా మెరుగ్గా పనిచేస్తున్నాయని, వివిధ రాష్ట్రాల నుంచి తెలంగాణకు వస్తున్న పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో టిఎస్ఐపాస్ విధానం ప్రకటించిన తరువాత 2500 కు పైగా పరిశ్రమలు నెలకొల్పి ఉత్పత్తి ప్రారంభించడం జరిగిందని, దీనికి ప్రధాన కారణం శాంతి భద్రతలు మెరుగ్గా వుండడమే కారణమని పలువురి అభిప్రాయంగా ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో క్రైమ్ రేట్ గణనీయంగా తగ్గిందని, అదే విధంగా నేరం చేసిన వారి పట్ల పోలీసులు మానవతా కోణంలో ఆలోచించి వారిని బాగు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు.

సమావేశంలో పాల్గొన్న డిజిపి అనురాగ్ శర్మ పోలీసు శాఖకు అవసరమైన కానిస్టేబుళ్ల నియమాకాలు, ఇతర అంశాలపై ముఖ్యమంత్రికి వివరించారు. ఖాళీగా వున్న కానిస్టెబుల్ పోస్టుల భర్తీ త్వరితగతిన పూర్తి చేయాలనే అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. శాంతి భద్రతలు మెరుగ్గా వుండడం వల్ల గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఒకరినొకరు పరస్పర గౌరవంతో పలుకరించుకునే సమాజం ఏర్పాటవుతున్నదని సిఎం అన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**